
జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 136 29-5-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



## పశ్చిమాసియాలో మళ్లీ సెగలు?


- ఇరాన్‌పై మరోసారి దాడికి దిగిన అమెరికా
- బందర్ అబ్బాస్‌లో సైనిక స్థావరంపై క్షిపణులు
- నాలుగు ఇరాన్ అటాక్ డ్రోన్లు కూల్చివేత
- కువైట్‌లో అమెరికా స్థావరంపై ఇరాన్ ప్రతీకార దాడి

వాషింగ్టన్/దుబాయ్: అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఒకవైపు శాంతి చర్చలు కొనసాగుతుండగానే.. మరోవైపు ఇరుదేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ సైనిక స్థావరంపై


2 లో

## ఎన్టీఆర్.. ఓ స్ఫూర్తి

- అమెరికా అధ్యక్షుడికి వార్నింగ్ ఇచ్చిన ఇందిర.. ఎన్టీఆర్‌కు కులం, ప్రాంతం, భాష లేదు
- ఆయన విగ్రహంపై ఎవరేమన్నా భయపడను.. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్
- ఆయన నీడన బతికి తక్కువ చేసి మాట్లాడొచ్చా?.. ఆయన పేరుతో నకిలీ నేత ఉన్నారు
- మహిళా రిజర్వేషన్లు రాజీవ్, ఎన్టీఆర్‌ల చలవే.. బాబు ప్రణాళికతోనే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్
- ఫ్యూచర్ సిటీకి దిగ్గజ కంపెనీలను తెస్తాం.. ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఇందిరమ్మ స్ఫూర్తి, ఎన్టీఆర్ ఆలోచనా విధానం కనిపిస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాసంక్షేమం విషయంలో స్ఫూర్తి పొందడంలో తమకు ఇందిరమ్మ ఎంత ముఖ్యమో, ఎన్టీఆర్ కూడా అంతే ముఖ్యమని చెప్పారు. ఇందిరమ్మ ఒక తరం అయితే ఎన్‌టీఆర్ ఒక శకమని, వారిద్దరి మేలు కలయికే ఈ నాటి కాంగ్రెస్ ప్రజాపాలన అని వ్యాఖ్యానించారు. నిరుపేదల అభ్యున్నతిని వారి ఆదర్శంతోనే కొనసాగిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గురువారం రేవంత్ అమీర్‌పేట మైత్రి వనం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశ చరిత్రలో ముగ్గురు జాతి రత్నాలను స్మరించుకోవాలని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, ఉక్కుమహిళ ఇందిరాగాంధీల తర్వాత మూడో వ్యక్తి తెలుగు జాతి గర్వించదగ్గ నేత ఎన్‌టీఆర్ అన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు సమాన హక్కులు కల్పించింది అంబేడ్కర్ అయితే, భూస్వాముల



## ఏపీ మద్యం కుంభకోణం కేసు...

- ఏడున్నర గంటల పాటు విజయసాయిరెడ్డి విచారణ
- బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో విచారించిన అధికారులు
- మద్యం పాలసీ కేసుతో తనకు సంబంధం లేదన్న విజయసాయిరెడ్డి
- రాజ్ కెసిరెడ్డి పేరు తప్ప తాను ఎవరి పేరు చెప్పలేదని వెల్లడి

## 'హైబ్రిడ్' మహానాడు
# సూపర్‌హిట్!

### ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వాలి
### యువతను రాజకీయాల్లో ప్రోత్సహించిన మహోన్నతుడు
### మహానాడు తీర్మానంలో చంద్రబాబు డిమాండ్

అమరావతి,మే: 1,875 క్లస్టర్ల నుంచి మహానాడుకు టీడీపీ నేతలు, శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మహానాడులో ఆయనకు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం ప్రసంగించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మహానాడులో ప్రతిపాదించారు. దేశ అత్యున్నత పౌర పురస్కారంతో ఎన్టీఆర్‌ను సత్కరించాలని సీఎం చంద్రబాబు కోరారు. ని చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం.. యువతకు దిక్సూచి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పించారని ప్రస్తావించారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని.. భవిష్యత్తులో సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్తు కార్యాచరణ చేపడుతున్నామని అన్నారు. నిన్నటి మహానాడులో

మిగతా 2లో





## మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, బూతునాడు

- టీడీపీని చెప్పల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ
- తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు
- తెలుగుదేశంపై మాజీమంత్రి రోజా ఘాటు విమర్శలు



2 లో

## హైదరాబాద్‌లో యాపిల్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్

- టీ--హబ్ వద్ద 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు
- దసరా నాటికి వినియోగదారులకు అందుబాటులోకి
- సర్వీస్, కాల్ సెంటర్‌తోపాటు బ్యాకెండ్ సపోర్ట్ కూడా..
- గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌గా తీర్చిదిద్దనున్న కంపెనీ
- మొత్తం 3 లక్షల చదరపు అడుగుల్లో భవనం

హైదరాబాద్: అమెరికా టెక్ దిగ్గజం యాపిల్.. హైదరాబాద్‌లో దసరా నాటికి ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. రాయదుర్గంలోని టీ--హబ్ సమీపంలో 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో


## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

### నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
### భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం
### మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబుల వెల్లడి

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు



2 లో



## ఎట్టకేలకు సిద్ధరామయ్య
# రాజీనామా

- గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత
- అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన
- జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి

# ఎట్టకేలకు సిద్ధరామయ్య

బెంగళూరు: కర్ణాటకలో అధికార మార్పిడికి అడ్డంకులు తొలగిపోయాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచనల మేరకు పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఆయన గురువారం మధ్యాహ్నం బెంగళూరులోని లోక్‌భవన్‌కు చేరుకున్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అందుబాటులో లేకపోవడంతో లోక్‌భవన్ ప్రత్యేక కార్యదర్శి ప్రభుశంకర్‌కు రాజీనామా లేఖను అందజేశారు.

ఈ సందర్భంగా సిద్ధరామయ్య వెంట ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఉన్నారు. శుక్రవారం సాయంత్రంలోగా గవర్నర్ లోక్‌భవన్‌కు తిరిగి వస్తారని, వీలైతే ఒకసారి వచ్చి రాజీనామా విషయాన్ని స్వయంగా గవర్నర్‌కు తెలియజేయాలని ప్రభుశంకర్ కోరారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ వ్యక్తిగత కారణాలతో అత్యవసరంగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు పయనమయ్యారు. బెంగళూరుకు తిరిగి వచ్చిన తర్వాత సిద్ధరామయ్య రాజీనామాను అధికారికంగా ఆమోదించే అవకాశాలు ఉన్నాయి. రాజీనామా సమర్పించిన లోక్‌భవన్ నుంచి బయటకు వచ్చిన సిద్ధరామయ్యకు ఊహించని పరిణామం ఎదురయ్యింది. వందలాది మంది అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆయనకు మద్దతుగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. రాజీనామా చేయవద్దని కోరారు. సిద్ధరామయ్య కారుకు అడ్డుతగిలారు. రాజీనామాను ఉపసంహరించుకోవాలని కోరుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

**రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగుతా..**

రాజీనామా సమర్పించిన అనంతరం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. రాజ్యసభకు పంపిస్తామంటూ కాంగ్రెస్ అధిష్టానం నుంచి ఆఫర్ వచ్చిందని తెలిపారు. తనకు జాతీయ రాజకీయాలపై ఆసక్తి లేదని వినమ్రంగా ఆ వినతిని తోసిపుచ్చినట్లు చెప్పారు.

రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగుతానని, ప్రజలు తమకు ఐదేళ్లపాటు పదవీకాలం ఇచ్చారని, ఇంకా రెండేళ్ల కాలం మిగిలి ఉందని, అప్పటివరకు వారి కోసం కోసం పని చేయాల్సి ఉందని అధిష్టానానికి చెప్పినట్లు వెల్లడించారు. తనపై ఎలాంటి ఒత్తిడి లేదని, పార్టీ పెద్దల ఆదేశాల మేరకు మనస్ఫూర్తిగా రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తదుపరి ముఖ్యమంత్రి ఎవరనేది పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తుందని తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలు, హైకమాండ్ నిర్ణయం మేరకు నూతన ముఖ్యమంత్రి ఎంపిక జరుగుతుందన్నారు.

ఢిల్లీ బదులు జైపూర్‌కు సిద్ధరామయ్య విమానం

రాజీనామా అనంతరం సిద్ధరామయ్య తన కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి రణదీప్ సూర్జేవాలాతోపాటు తన వర్గం మంత్రులు, నాయకులతో కలిసి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరారు. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా ఈ విమానాన్ని రాజస్తాన్‌లోని జైపూర్‌లో ల్యాండ్ చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంఓ) ప్రకటించింది.

# ఎన్టీఆర్.. ఓ స్ఫూర్తి

వద్ద లక్షల ఎకరాల భూమిని తీసుకొని నిరుపేదలకు భూములిచ్చి గౌరవాన్ని కల్పించింది ఇందిర అన్నారు. యుద్ధంలో భారత ప్రధానమంత్రుల లొంగుబాటును చూస్తున్నామని, 1971లో ఇందిర పాకిస్థాన్ మీద యుద్ధం గెలిచి బంగ్లాదేశ్‌ను విముక్తం చేశారని చెప్పారు. భారత రాజకీయాలలో వేలు పెట్టొద్దని అమెరికా అధ్యక్షుడినే హెచ్చరించిన ఉక్కు మహిళగా అభివర్ణించారు. నీతి, నిజాయితీ, నిబద్ధత, ఉక్కు సంకల్పం ఉన్న నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారంటే ఆయన ఎన్టీఆరేనన్నారు. ఆయన తెలుగు జాతి గర్వించదగ్గ బిడ్డ అని వ్యాఖ్యానించారు. మానవ మనుగడ ఉన్నంత కాలం ఆ ముగ్గురి కీర్తి ప్రతిష్ఠలు ఉంటాయని చెప్పారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అమీర్‌పేట మైత్రివనం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, నందమూరి కుటుంబ సభ్యులు, నటుడు మంచు మనోజ్, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్నారు. అన్న ఎన్టీఆర్ లేకుంటే మీరు నాయకుడు అయ్యారా అని నిలదీశారు. అన్న నీడన బతికిన మీరు ఆయన గురించి తక్కువ చేసి మాట్లాడటమేమిటని ప్రశ్నించారు. రామారావు పేరు పెట్టుకున్న నకిలీలు కూడా కూడా ఈరోజు నాయకుడిగా చెలామణి అవుతున్నారని వ్యాఖ్యానించారు.ఎన్టీఆర్ అవకాశమిచ్చి, ప్రోత్సాహమిచ్చిన వారిలో తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, జానారెడ్డి, దేవేందర్ గౌడ్, కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులుతో పాటు కేసీఆర్ కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయ అవకాశం కల్పించిందే ఎన్టీఆర్ అన్నారు. ఈ చరిత్రను ఎవరూ మరువరాదని రేవంత్ రెడ్డి అన్నారు.

## హైదరాబాద్‌లో యాపిల్ ఎక్స్‌పీరియెన్స్ సెంటర్

ఇది కొలువుదీరనుంది. ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌తోపాటు సర్వీస్, కాల్ సెంటర్ సైతం ఏర్పాటు చేయనుంది. బ్యాకెండ్ సపోర్ట్ టీమ్ కూడా ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహించనుంది. వాటన్నింటి కోసం కంపెనీ మొత్తంగా సుమారు 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం లీజుకు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేంద్రాన్ని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌గా (జీసీసీ) యాపిల్ తీర్చిదిద్దనుందని సమాచారం. దాదాపు 1,400 మంది సిబ్బంది వరకు ఇక్కడ కూర్చునే వీలుంది. డేటా ప్రొటెక్షన్, మెడికల్, కమ్యూనికేషన్, ఏఐ, నేవిగేషన్ సిస్టమ్, ట్రాఫిక్ సర్వేలెన్స్, వాయిస్ రికగ్నిషన్ తదితర విభాగాలకు చెందిన సాంకేతిక నిపుణులు విధులు నిర్వర్తిస్తారు. డిజిటల్ ఆపరేషన్స్ కూడా ఇక్కడి నుంచే జరిపే అవకాశం ఉంది. ఇప్పటికే గచ్చిబౌలిలోని వేవ్‌రాక్‌లో యాపిల్‌కు జీసీసీ ఉంది. హైదరాబాద్‌లోని రెండు జీసీసీల కోసం కొత్తగా 3,500 మందిని యాపిల్ నియమించుకుందని తెలుస్తోంది.

## ఏపీ మద్యం కుంభకోణం కేసు...

ఏపీ మద్యం కుంభకోణం కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డిని ఈడీ సుమారు ఏడున్నర గంటల పాటు విచారించింది. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారులు ఆయనను విచారించారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మద్యం పాలసీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తాను ఎవరి పేర్లను అధికారులకు చెప్పలేదని వెల్లడించారు. మద్యం కుంభకోణానికి సంబంధించిన విషయాలన్నీ రాజ్ కెసిరెడ్డికి మాత్రమే తెలుసని చెప్పానని వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా గతంలో సీజ్ చేసిన మొబైల్ ఫోన్‌లలోని వివరాలను ఈడీ అధికారులు సేకరించారని తెలిపారు. లోపల ప్రశ్నలు, విచారణలు పెద్దగా ఏమీ జరగలేదని పేర్కొన్నారు. తన ఫోన్‌లోని డేటా ట్రాన్స్ ఫర్ కోసం పిలిచినట్లు చెప్పారు. వారికి అవసరమైన సమాచారం తన ఫోన్‌లో ఉంటుందనే ఉద్దేశంతో ఆ డేటాను తీసుకున్నట్లు చెప్పారు. మద్యం పాలసీ కుంభకోణం ఎలా జరిగింది, ఏం జరిగిందనే విషయాలు తెలిసిన వ్యక్తి రాజ్ కెసిరెడ్డి మాత్రమే అన్నారు. ఇప్పటి వరకు తాను ఆయన ఒక్కరి పేరు తప్ప ఎవరి పేరునూ చెప్పలేదని అన్నారు. సిట్ అధికారులకైనా, ఈడీ అధికారులకైనా తాను ఇదే విషయం చెప్పానని అన్నారు. తనను ఎవరు లక్ష్యంగా చేసుకున్నా భయపడే వ్యక్తిని కాదని వ్యాఖ్యానించారు. తిరుమల వెంకన్న సాక్షిగా తాను ఎలాంటి తప్పు చేయలేదని విజయసాయిరెడ్డి అన్నారు.

## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ పనులపై మార్గనిర్దేశర చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆధునిక మౌలిక వసతులతో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికి తలమానికంగా నిలవడం ఖాయమని మంత్రులు స్పష్టం చేశారు.

# 'హైబ్రిడ్' మహానాడుసూపర్‌హిట్!

జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు లోకేశ్ ప్రతిపాదించిన 33 శాతం రిజర్వేషన్‌ను మనమే ప్రారంభిద్దామని తెలిపారు. 33 శాతం రిజర్వేషన్లను మహిళలకు కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదామని అన్నారు. తెలుగు వెలుగుగా నిలిచిన స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనేది మన అందరి డిమాండ్ అని చెప్పారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు ఎన్టీఆర్ అని వ్యాఖ్యానించారు. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోయారని ఉద్ఘాటించారు. సామాన్యుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించారన్నారు. తెలుగు ప్రజల ఐక్యత కోసం పనిచేసిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని ఉద్ఘాటించారు. భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు విశిష్టం, అపూర్వమని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజల మనోభావాలను గుర్తించి ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానిస్తోందని తెలిపారు. ఇది మనందరి ఆకాంక్ష, ప్రతీ తెలుగువారి కోరిక అని చెప్పారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని కేంద్రప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు.ఎన్టీఆర్ అంటే అన్నివర్గాలు ప్రేమించే నాయకుడని ప్రశంసించారు. సాధారణ ఉద్యోగిగా మొదలై, సినిమా స్టార్‌గా ఎదిగి, ప్రజల కోసం పార్టీ పెట్టి సీఎంగా ఎదగడం ఎన్టీఆర్‌కే సాధ్యమని కీర్తించారు. ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని ఎన్టీఆర్ ఎప్పుడూ వీడలేదని తెలిపారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అనేదే ఎన్టీఆర్ సిద్ధాంతమని పేర్కొన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. ఎన్టీఆర్ జయంతి తెలుగువారందరికీ పండుగ రోజు అని తెలిపారు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి సినీ జీవితంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారని ప్రశంసించారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదని అన్నారు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారని తెలిపారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వరకూ, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారని ఉద్ఘాటించారు.



## పశ్చిమాసియాలో మళ్లీ సెగలు

బుధవారం రక్షణాత్మక దాడికి దిగినట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. అంతకుముందు ఇరాన్ అటాక్ డ్రోన్లను కూల్చివేశామని పేర్కొంది. హార్మూజ్ జలసంధి పరిసరాల్లో ముప్పుగా పరిణమించిన నాలుగు ఇరాన్ వన్--వే దాడి డ్రోన్లను అమెరికా సెంట్రల్ కమాండ్ దళాలు కూల్చివేసినట్లు వెల్లడించింది. బందర్ అబ్బాస్‌లోని ఇరాన్ గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్‌పై అమెరికా దళాలు క్షిపణులు వర్షం కురిపించాయి. ఐదో డ్రోన్‌ను ప్రయోగించడానికి ఇరాన్ జవాన్లు సిద్ధమవుతున్న సమయంలోనే ఈ దాడి జరిగింది.

**ఒప్పందం దగ్గర్లోనే ఉంది**

ఇరాన్ సైనిక శక్తి చాలావరకు క్షీణించిందని, అందుకే తమతో చర్చలకు ముందుకొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. బుధవారం కేబినెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి తొందరేమీ లేదని చెప్పారు. ఈ ఏడాది నవంబర్‌లో అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ఉన్నప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం విషయంలో తాము తొందరపడడం లేదన్నారు. అయితే, అమెరికా--ఇరాన్ శాంతి ఒప్పందం దగ్గర్లోనే ఉందని వ్యాఖ్యానించారు. హార్మూజ్ జలసంధిని నియంత్రించడానికి ఒమన్ సహా ఏ ఒక్క దేశాన్ని కూడా అనుమతించబోమని డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే కొత్త ఒప్పందంలో భాగంగా.. ఇరాన్, ఒమన్ కలిసి హార్మూజ్ గుండా జరిగే రవాణాను నియంత్రిస్తాయంటూ వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. ఆ జలసంధిని ఎవరూ కంట్రోల్ చేయలేరని అన్నారు. అవి అంతర్జాతీయ జలాలు అని గుర్తుచేశారు.ఒమన్ కూడా అందరిలాగే ప్రవర్తించాలని వ్యాఖ్యానించారు. లేకపోతే మనం ఒమన్‌ను కూడా పేల్చివేయాల్సి వస్తుందని తేల్చిచెప్పారు.

**కువైట్‌లో అమెరికా స్థావరంపై ఇరాన్ దాడి**

అమెరికాపై ఇరాన్ సైన్యం ప్రతీకార దాడులకు దిగింది. కువైట్‌లోని అమెరికా సైనిక స్థావరంపై బుధవారం రాత్రి క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. అయితే, వీటిని కువైట్ గగనతల రక్షణ వ్యవస్థలు మధ్యలోనే కూల్చివేసినట్లు అమెరికా సైనిక వర్గాలు గురువారం స్పష్టంచేశాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని ఆరోపించాయి. తమ భూభాగంపై దాడి జరిగిందని కువైట్ ప్రకటించింది. అయితే, తమపై తొలుత దాడిచేసినందుకు ప్రతీకారంపై ఓ గల్ఫ్ దేశంలో అమెరికా స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ తేల్చిచెప్పింది. ఒమన్‌కు ట్రంప్ హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే ఒమన్, అమెరికా మిత్రదేశాలు. అమెరికా సైనిక కార్యక్రమాలకు ఒమన్ సహకరిస్తోంది. అమెరికా, ఇరాన్‌ల మధ్య నిశ్శబ్ద మధ్యవర్తిగా వ్యవహరిస్తూ వచ్చింది.

## మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, బూతునాడు

తిరుపతి తెలుగుదేశం పార్టీ, మహానాడుపై మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు .. తిరుపతిలో మీడియాతో మాట్లాడిన ఆమె.. టీడీపీ, సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడును లక్ష్యంగా చేసుకుని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ఒక 'బోగస్ పార్టీ' అంటూ వ్యాఖ్యానించిన రోజా, ఆ పార్టీకి కోటి మంది సభ్యులు ఉన్నారని చెప్పుకుంటున్నప్పటికీ మహానాడును చూస్తే రాష్ట్రంలో ఎక్కడా ఉత్సాహం కనిపించడం లేదన్నారు. మహానాడు అట్టర్ ఫ్లాప్ అయ్యింది. అందుకే రికార్డ్ డ్యాన్సులు వేసి పార్టీ క్యాడర్‌ను కూర్చోబెడుతున్నారని అంటూ ఎద్దేవా చేశారు. మహానాడును ఉద్దేశించి 'ఇది మహానాడు కాదు.. దగానాడు, మాయానాడు, భూతునాడు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సూపర్ సిక్స్ హామీల గురించి ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పకుండా తల్లి, చెల్లి, గొడ్డలి అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇక, చంద్రబాబు.. హెరిటేజ్ ఆస్తుల్లో తన తల్లి, చెల్లికి ఎంత ఆస్తులు ఇచ్చారో చెప్పగలరా అని రోజా ప్రశ్నించారు. వాళ్లు ఎక్కడ ఉన్నారో కూడా ప్రజలకు తెలియదు. తల్లికి, చెల్లికి సహాయం చేసినట్టు ఒక్క ఫోటో అయినా చూపించగలరా అని విమర్శించారు. ఈ దేశంలో జగన్ తన చెల్లికి ఇచ్చినంత ఆస్తులు మరెవ్వరూ ఇవ్వలేదని రోజా వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసుపై కూడా రోజా స్పందించారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే వివేకా హత్య జరిగిందని గుర్తుచేస్తూ, అప్పట్లో నిందితులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. వివేకా కేసులో నిందితుడైన దస్తగిరికి టీడీపీ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. చంద్రబాబు కేసులు వాదించే లాయరే ప్రస్తుతం దస్తగిరికి లాయర్‌గా ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీని చెప్పుల పార్టీ, వెన్నుపోటు పార్టీ, దొంగల పార్టీ అంటూ రోజా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్‌పై చెప్పులు వేయించారని, వెన్నుపోటు పొడిచారని, ఆయన పార్టీని దొంగతనంగా లాక్కున్నారని ఆరోపించారు. పెద్ద ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు. చిన్న ఎన్టీఆర్‌కు లోకేష్ వెన్నుపోటు పొడవలేదా? అంటూ ప్రశ్నించారు. అలాగే పవన్ కల్యాణ్ తల్లిని తిట్టించింది కూడా లోకేష్ కాదా అని ప్రశ్నించారు. మరోవైపు.. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇస్తామని లోకేష్ చెబుతున్నారని, అయితే అది కేవలం డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమేనని రోజా విమర్శించారు. టీడీపీకి నిజంగా దమ్ముంటే మహానాడులో 33 శాతం మహిళా రిజర్వేషన్‌పై తీర్మానం చేయాలి. బీజేపీ మహిళా బిల్లును అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని కూలదోస్తామని చెప్పగలరా?' అని ఆమె సవాల్ విసిరారు. జగన్ ఇప్పటికే 2023 అసెంబ్లీలో మహిళా బిల్లుపై తీర్మానం చేశారని, స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ఎప్పుడో ప్రకటించారని రోజా తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి టీడీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని రోజా ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలను చంద్రబాబు అడ్డదిడ్డంగా పెంచుతున్నారని విమర్శించారు. పేదలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చెప్పే చంద్రబాబు, తన కుటుంబంలో మాత్రం ఒక్కో పిల్లవాడినే కనారని ఎద్దేవా చేశారు. లోకేష్‌పై కూడా రోజా తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, 'జూమ్ మీటింగ్‌లో కొడాలి నాని, వల్లభనేని వంశీ వస్తే భయపడి పారిపోయిన వ్యక్తి లోకేష్' అని విమర్శించారు.



## త్యాగనిరతికి ప్రతీక 'బక్రీద్'.. పోచంపల్లిలో పండుగ కోలాహలం!

- శుభాకాంక్షలు తెలిపిన చౌటుప్పల్ రూరల్ సీఐ రాములు, ఎస్ఐ భాస్కర్ రెడ్డి
- ఈద్గా వద్ద ముస్లింల సామూహిక ప్రత్యేక ప్రార్థనలు
- పేదలకు కుర్బానీ మాంసం పంపిణీ

**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు) :** త్యాగానికి, భక్తిప్రపత్తులకు ప్రతీకయైన బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) పర్వదిన వేడుకలను పురపాలక కేంద్రంలో ముస్లిం సోదరులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఈద్గా మైదానం ముస్లింల సామూహిక ప్రార్థనలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. నూతన వస్త్రాలు ధరించిన ముస్లింలు ఉదయాన్నే ఈద్గాకు చేరుకుని ప్రత్యేక నమాజ్ ఆచరించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' అంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

**సహోదర భావం చాటాలి:**

ఈ ప్రార్థనా కార్యక్రమాల్లో చౌటుప్పల్ రూరల్ సీఐ రాములు, స్థానిక ఎస్ఐ భాస్కర్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు అందజేశారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పండుగ నిబంధనల ప్రకారం.. నమాజ్ అనంతరం ముస్లింలు మేకలను కుర్బానీ (బలిదానం) ఇచ్చి, ఆ మాంసాన్ని నిరుపేదలకు, బంధుమిత్రులకు పంచిపెట్టి త్యాగనిరతిని చాటుకున్నారు. ఈ వేడుకల్లో మదీనా మసీదు ఇమామ్ ఖాసీఫ్, మసీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ ఇబ్రహీం అలీ, ప్రముఖులు మహమ్మద్ షరీఫ్, సయ్యద్ సాధక్, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఏజాస్, మహమ్మద్ అలీ పుల్లా, సయ్యద్ అజ్జు, మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ రసూల్, ఉమర్, సయ్యద్ అబ్బాస్, నదీమ్, అన్వార్, జమీల్, అక్బర్, హైమద్, షేక్ జహంగీర్, వహీద్, మోహిన్, జబ్బార్, గాలిబ్, బాబా, అదనాన్, లతీఫ్, జానీ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల గుండెల్లో నిలిచిన నాయకుడు ఎన్టీఆర్

- ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ
- బడుగుల అభ్యున్నతికే ఎన్టీఆర్ కృషి: భువనగిరి పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి భారత ఆంజనేయులు




**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు):** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను పురపాలక కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు భువనగిరి పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి భారత ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో చికిత్స పొందుతున్న రోగులకు పార్టీ శ్రేణులతో కలిసి పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భారత ఆంజనేయులు మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతి ధ్యేయంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, పేదల గుండెల్లో జననాయకుడిగా చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కుక్కలీ మహేష్, పట్టణ శాఖ అధ్యక్షుడు నార్ల రాజు యాదవ్, మాజీ అధ్యక్షుడు బైర్ లక్ష్మయ్య, సీనియర్ నాయకులు భారత భూషణ్, వేముల వాసుదేవ్, శీను, వీడం విష్ణు, వల్లందాస్ బక్కయ్య, చిలువేరు గోవర్ధన్, మునుకుంట్ల రామచంద్రం, దూలం ధనుంజయ, సీత నరసింహ, ఆకుల సత్యం, తాటి శ్రీనివాస్, బొమ్మ వెంకటేష్ మరియు ఎన్టీఆర్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బంక్‌ల్లో నో స్టాక్

నగరంలో ఇంధన కొరతతో వాహనదారుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం తెరిచిన బంక్‌లు మధ్యాహ్నం వరకు నో స్టాక్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. ఇటీవల వరుసగా ఇంధన ధరలు పెరగడం.. కొరత వేధించడం వాహనదారులకు కష్టాలు తెచ్చిపెట్టాయి. సికింద్రాబాద్, బేగంపేట, ఖైరతాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్డు, తార్నాక, దిల్‌సుక్‌నగర్ తదితర ప్రాంతాల్లోని బంక్‌లు చాలా వరకు నో స్టాక్ బోర్డుతో మూసి ఉన్నాయి. దీంతో ఇంధనం దొరికే ప్రాంతాల బంక్‌లకు తిరగాల్సి వచ్చిందని ప్రకాశ్ అనే వాహనదారుడు తెలిపాడు. ఇంకోవైపు సీఎన్‌జీ కోసం ఆటోలు గంటల తరబడి క్యూలో ఉండాల్సిన పరిస్థితి ఇంకా కొనసాగుతూనే ఉందని ఆటో డ్రైవర్ శాతం రమేశ్ చెప్పాడు. ప్రభుత్వం ఇంధన కొరత సమస్యను సత్వరమే పరిష్కరించాలని, బ్లాక్ మార్కెట్ తెరతీసిన బంక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి: మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, శ్రీధర్‌బాబు
- వంగపల్లిలో ఐకేపీ కేంద్రం పరిశీలన.. కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమీక్ష




**తొలివెలుగు, రామన్నపేట/భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. మొదట భువనగిరి మండల పరిధిలోని వంగపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ తూకాలు జరుగుతున్న తీరును, గింజ తేమ శాతాన్ని పరిశీలించి, నేరుగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



**అన్ని సౌకర్యాలు కల్పించాలి:**

అనంతరం భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియపై పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులతో మంత్రులు ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఐకేపీ కేంద్రాలకు వచ్చే రైతులకు ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ వంటి అవసరమైన అన్ని కనీస సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించి, రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. గడువులోగా కొనుగోళ్లు పూర్తి చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని పౌర సరఫరాల కమిషనర్‌ను, కలెక్టర్‌ను ఆదేశించారు.ఐఈ పర్యటన, సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యేలు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవిచంద్ర, జిల్లా కలెక్టర్, డీసీపీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# రేపల్లెలో ముగిసిన 'మహానాడు' వేడుకలు





- టీవీ స్క్రీన్ ద్వారా మంత్రి అనగాని సత్యప్రసాద్ సందేశం
- ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు.. నివాళులర్పించిన నేతలు

**తొలివెలుగు, రేపల్లె:** రేపల్లె పట్టణంలోని 1, 2 క్లస్టర్ల పరిధిలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గత రెండు రోజులుగా జరుగుతున్న మహానాడు కార్యక్రమాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నేత అనగాని శివప్రసాద్, మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ రావు, నియోజకవర్గ పరిశీలకురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, పంతాని మురళీధర్ రావు తదితరులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ భారీ టీవీ స్క్రీన్ (వర్చువల్) ద్వారా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.

**తెలుగు ప్రజల మహా వేడుక:**

మంత్రి అనగాని మాట్లాడుతూ.. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన, సంక్షేమ పాలనకు ఆద్యుడైన పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న మహానాడు కేవలం ఒక పార్టీ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల మహా పండుగగా రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో హైబ్రిడ్ విధానంలో మహానాడును విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. టీవీ స్క్రీన్ల ద్వారా నాయకులు, కార్యకర్తలు ఏకకాలంలో భాగస్వాములు కావడం పార్టీ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకుంటోందనడానికి నిదర్శనమని చెప్పారు. ఈసారి మహానాడులో మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ "స్త్రీ శక్తి"ని ప్రధాన అంశంగా తీసుకోవడం ద్వారా మహిళలకు టీడీపీ అత్యున్నత స్థానం కల్పిస్తోందని స్పష్టం చేశారు.

**ఎన్టీఆర్‌కు నివాళులు - ప్రేమ విందు:**

అనంతరం నేతలు స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహానాడు ప్రత్యక్ష ప్రసారం కోసం ఏర్పాటు చేసిన భారీ టీవీ స్క్రీన్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన నాయకులు, కార్యకర్తలకు నిర్వాహకులు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంతాని మురళీధర్ రావు, కొండపల్లి వెంకటేశ్వరరావు, తాత ఏడుకొండలు, జీవి నాగేశ్వరావు, కొలసాని రాము, మేకా రామకృష్ణ, కేసన నరసింహారావు, కొమ్మూరు సత్యం, దండుప్రోలు వెంకటేశ్వరరావు, పంతాని సాయి కుమార్, దండుప్రోలు పిచ్చయ్య, నాగాంజనేయులు, శేషు, ఎర్రగళ్ల ధర్మతేజ, బొర్రా సూర్యరాజు, పొన్నూరు గౌరీ రామకుమారి, పంతగాని ప్రేమలత చార్లెస్, దున్న జయప్రద, లక్ష్మీ నరసమ్మ, అంక నాగదేవి తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నారం జెడ్పీహెచ్ఎస్‌లో వాటర్ మోటార్ చోరీ

- హెచ్ఎం ఫిర్యాదుతో కేసు నమోదు.. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**తొలివెలుగు, రామన్నపేట:** మండలంలోని ఎన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో గురువారం చోరీ ఘటన చోటుచేసుకుంది. పాఠశాల ఆవరణలో నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన వాటర్ పంపు మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్న సమయంలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గురువారం ఉదయం పాఠశాల సిబ్బంది వచ్చి పరిశీలించగా, నీటి తొట్టి వద్ద ఉండాల్సిన మోటార్ పంపు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆనవాళ్లు లభించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. మోటార్ చోరీకి గురికావడంతో పాఠశాలలో తాగునీరు సహా ఇతర అవసరాలకు నీటి సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విషయం తెలుసుకున్న ప్రధానోపాధ్యాయుడు వెంటనే రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వక ఫిర్యాదు చేశారు. హెచ్ఎం ఫిర్యాదు మేరకు రామన్నపేట ఎస్సై డి. నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించిన ఎస్సై, చోరీకి పాల్పడిన నిందితులను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో భద్రతా చర్యలు మరింత బలోపేతం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జలమండలి అట్టర్ ఫ్లాప్.. ట్యాంకర్ల డెలివరీలో ఫెయిల్ జీఖ్రశ్రీఖఝఅఖ్రశ్రీఱ । గ్రేటర్‌వ్యాప్తంగా తాగునీరందక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్తీలు, కాలనీల్లో నీటి సమస్య విలయ తాండవం సృష్టిస్తున్నది. ఎక్కడ చూసినా సరఫరా లేకపోవడం, లో ప్రెషర్ సమస్యలు వేధిస్తున్నాయి. అధికారులు తాగునీటి సరఫరా తగ్గించి ట్యాంకర్లకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

## ట్యాంకర్ల డెలివరీలో ఫెయిల్

గ్రేటర్‌వ్యాప్తంగా తాగునీరందక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్తీలు, కాలనీల్లో నీటి సమస్య విలయ తాండవం సృష్టిస్తున్నది. ఎక్కడ చూసినా సరఫరా లేకపోవడం, లో ప్రెషర్ సమస్యలు వేధిస్తున్నాయి. అధికారులు తాగునీటి సరఫరా తగ్గించి ట్యాంకర్లకు మళ్లిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే బస్తీలు, కాలనీలకు రావాల్సిన నీటిని ధనవంతులు నివసించే అపార్ట్‌మెంట్లు, హైరైజ్ భవనాలకు తరలిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు భారీ మొత్తంలో ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఫిల్లింగ్ స్టేషన్లలోని జలమండలి సిబ్బంది నిర్లక్ష్యంతో సకాలంలో డెలివరీ కావడం లేదు. చాలామందికి బుక్‌చేసుకున్నాక టోకెన్ రావడానికి మూడు నాలుగు రోజుల సమయం పడుతున్నది. సిబ్బంది, ట్యాంకర్ల యజమానులకు అనుకూలమైన వారికి మాత్రం సకాలంలో డెలివరీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వందలాది ట్యాంకర్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో జలమండలి అధికారులు డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో రోజంతా డెలివరీ చేసేలా నిబంధనలు సడలించారు. అయినా సకాలంలో డెలివరీ కాకపోవడం జలమండలి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం బట్టబయలు అవుతున్నది. జలమండలి పరిధిలోని ఏ ఫిల్లింగ్ స్టేషన్‌లోనైనా 24 గంటలలోపు ట్యాంకర్ డెలివరీ కావడం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలమండలి ట్యాంకర్లు సకాలంలో రాకపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించి వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిపెట్టి ట్యాంకర్లు 24 గంటల్లోపు డెలవరీ అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

### సకాలంలో రాకపోవడంతో రెండోది బుకింగ్

జలమండలి అధికారుల నిర్లక్ష్యంతో ట్యాంకర్లు సకాలంలో డెలవరీ కాకపోవడంతో వినియోగదారులు రెండోసారి బుక్ చేసుకుంటున్నారు. రెండుమూడు రోజులు వేచి చూసి నీటి సమస్య తీవ్రమవుతుండటంతో మరోసారి బుక్ చేస్తున్నారు. నగరవ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ట్యాంకర్లు వేలాదిగా పెండింగ్‌లో ఉంటున్నాయి. గురువారం ఏకంగా 20,900 ట్యాంకర్లు పెండింగ్‌లు ఉన్నాయి. సిబ్బంది సకాలంలో డెలివరీ చేస్తే ఇంత మొత్తంలో పోగుపడేవి కాదు. టోకెన్ నంబర్ వచ్చినవారికి ట్యాంకర్ యజమానులు ఫోన్ చేసిన సమయంలో పలుకారణాలతో లిఫ్ట్ చేయకుంటే వాటిని పక్కదారి పట్టిస్తున్నారు. ట్యాంకర్ బుక్ చేసుకున్న ట్యాంకర్ డ్రైవర్లు, యజమానులకు తెలిసిన వ్యక్తులకు డెలివరీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు ఒక వ్యక్తి బుక్ చేసుకున్న ట్యాంకర్‌ను టోకెన్ రాకున్నా ఎక్కువ డబ్బులు తీసుకుని ఇతరులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నది. దీంతో ఒక్కో వినియోగదారుడు రెండు మూడు ట్యాంకర్లు బుక్ చేసుకున్నా ఇండ్లకు చేరని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా డెలివరీ వేగవంతంగా చేయకపోవడం వల్ల భారీ మొత్తంలో పెండింగులో ఉంటున్నాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ట్యాంకర్ల డెలివరీలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు. ఎండల తీవ్రత తగ్గేదాకా ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.



# ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి



- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నకిరేకంటి మొగులయ్య
- రామన్నపేటలో బీజేపీ 'బీఎల్ఏ-2' మండల కార్యశాల

**తొలివెలుగు, రామన్నపేట:** ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏ-2) పూర్తి సమయం కేటాయించి బాధ్యతాయుతంగా పనిచేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నకిరేకంటి మొగులయ్య పిలుపునిచ్చారు. రామన్నపేట పట్టణ కేంద్రంలో గురువారం భారతీయ జనతా పార్టీ 'బీఎల్ఏ-2' మండల కార్యశాల సమావేశం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి నకిరేకంటి మొగులయ్యతో పాటు మండల ఇన్‌చార్జి కొరివి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా క్షేత్రస్థాయిలో చొరవ చూపాలని వారు కోరారు.

### మోదీ పాలన విశేషాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి:

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జూన్ 10వ తేదీ నాటికి విజయవంతంగా 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూన్ 10 నుంచి జూన్ 21 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కాలంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అలాగే జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో యోగా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వనం అంజయ్య, యువమోర్చా జిల్లా కార్యదర్శి అక్కేనపల్లి సైదులు, ఉపసర్పంచ్‌లు నల్ల మధుసూదన్ రెడ్డి, మూడుదుడ్ల రమేష్, సుర్వి హరిబాబు, మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్, సీనియర్ నాయకులు కట్ట యాదయ్య, జెల్ల లక్ష్మీనారాయణ, రాపోలు స్వామి, నాయకులు మద్దెలపురి ఐలయ్య, బడుగు యాదగిరి, ఏలే వెంకట్ నర్సు, రాపోలు విశ్వనాథం, భాషకార్ల నరేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బట్టే రమేష్, చిల్ల నరేష్, భైరబోయిన రమేష్, చిన్నపాక స్వామి, బద్దుల మల్లేష్, మేడి పరశు రాం, వీరమల్ల సత్యనారాయణ, బొడ్డుపల్లి మల్లేష్, బండమీది శ్రీనివాస్, ఎర్రబోయిన వెంకటేష్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

- చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి
- తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌దే: జంగయ్య గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షుడు జంగయ్య గౌడ్, మండల ఉపాధ్యక్షుడు నల్ల పర్వతాలు యాదవ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, 'జోహార్ ఎన్టీఆర్' అంటూ నినాదాలు చేస్తూ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధ్యక్షుడు జంగయ్య గౌడ్, మండల ఉపాధ్యక్షుడు నల్ల పర్వతాలు యాదవ్ మాట్లాడుతూ.. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహానాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు రాజకీయ గుర్తింపు కల్పించడమే ధ్యేయంగా పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది నెలల స్వల్ప వ్యవధిలోనే అధికారంలోకి తీసుకువచ్చిన ఏకైక ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రూ.2 కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు వంటి విప్లవాత్మక పథకాలతో పేదల హృదయాల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రామిరెడ్డి, ముఖ్య నాయకులు తడక కోటేష్, గోవిందా చారి, వెంకటేశం, అంతటి కిష్టయ్య, అంజయ్య, లక్కారం జంగయ్య గౌడ్, బొంగు బాదుషా, చెరుకు అశోక్ గౌడ్, సింగిరెడ్డి సురేందర్ రెడ్డి, నరసింహా గౌడ్ తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.






## కేరళ మాజీ సీఎం ఇంటిపై ఈడీ దాడులు దురదృష్టకరం

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి
- చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై సీపీఎం నిరసన

**తొలివెలుగు, చౌటుప్పల్:** కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు పినరయి విజయన్ ఇళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జరిపిన దాడులను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ దాడులకు నిరసనగా చౌటుప్పల్ మండల, మున్సిపల్ కమిటీల ఆధ్వర్యంలో గురువారం స్థానిక జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లపాటు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసినప్పటికీ పినరయి విజయన్‌కు సొంత ఇల్లు కూడా లేదని, పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆయన అద్దె ఇంట్లో నివసిస్తున్నారని గుర్తుచేశారు. అలాంటి నిరాడంబర నాయకుడి నివాసంపై ఈడీ దాడులు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

### దర్యాప్తు సంస్థల దుర్వినియోగం:

కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే గొంతుకలను నొక్కేందుకే నేరుగా ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రతిపక్షాలను, ప్రశ్నించే మీడియాను సహించలేని స్థితిలో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. నాటి వీర తెలంగాణ సాయుధ పోరాటంలో, దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ వారితో పోరాడి ప్రాణాలర్పించిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. ఇలాంటి ఈడీ దాడులకు భయపడి ప్రశ్నించే హక్కును కోల్పోయే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు రాజకీయ స్వార్థానికి దుర్వినియోగం చేస్తోందని తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, నాయకులు బత్తుల శ్రీశైలం గౌడ్, చీర్క సంజీవరెడ్డి, ఆకుల ధర్మయ్య, బోయ యాదయ్య, అంతటి అశోక్, తూర్పునూరు మల్లేష్, చికురు ఈదయ్య, సప్పిడి శ్రీనివాసరెడ్డి, బావుండ్లపల్లి స్వామి, బొడ్డు అంజిరెడ్డి, యాట బాలరాజు, తిగుళ్ల యాదమ్మ, తిగుళ్ల శంకరయ్య, బాలగోని బాలరాజు, మోగుదాల రాములు తదితరులు పాల్గొన్నారు.

# కదులుతున్న సంస్థ ఆర్థిక పునాదులు

దేశంలోనే అత్యంత ధనిక పట్టణాభివృద్ధి సంస్థగా, ప్రభుత్వ ప్రాజెక్టులకు కామధేనువులా నిలిచిన హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతిష్ట దిగజారిపోయింది. కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో చేతిలో చిల్లి గవ్వ లేక వేల కోట్ల ప్రాజెక్టుల భవితను ఆగమ్యగోచరంగా మార్చివేసింది. చేపట్టిన ప్రాజెక్టులన్నీ కాగితాలకే పరిమితం అవుతుండటం, దేశీయ బ్యాంకింగ్ సంస్థలు ముఖం చాటేయడాన్ని గమనించిన హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్.. యంత్రాంగాన్ని విదేశీ బాట పట్టించారు. ఖండాంతరాలు దాటి నిధుల కోసం కసరత్తు చేస్తున్నారు. గడిచిన రెండేండ్లలో కాంగ్రెస్ పాలన వైఫల్యాలు, రియల్ ఎస్టేట్ రంగాన్ని నిర్వీర్యం చేసేలా చేపట్టిన విధానాలతో మున్సిపల్ శాఖపై ప్రభుత్వం పట్టు కోల్పోయింది. ఇక స్వయంగా ముఖ్యమంత్రియే ఈ శాఖ మంత్రిగా వ్యవహరించినా.. చేపట్టిన ప్రాజెక్టులను పట్టాలెక్కించలేని దయనీయ పరిస్థితి. హెచ్ఎండీఏ పరిధిలో స్వయంగా శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకు అతిగతీ లేకుండా కాగితాలకే పరిమితం అవుతున్నాయి. దీనికి ప్రధాన కారణం నిధుల కొరత. గతంలో రియల్ ఎస్టేట్ రంగం మెరుగ్గా ఉన్న సమయంలో గత ప్రభుత్వం హెచ్ఎండీఏ పరిధిలో చేపట్టిన ప్రతి ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసింది. కానీ ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. ప్రతిపాదనలు రూపొందించడం, ఒక్క అడుగు ముందుకేసి టెండర్లు ఖరారు చేయడం వరకే నడుస్తోంది. మిగిలిన దంతా ప్రాజెక్టులు చేపట్టేందుకు నిధుల్లేక కాలయాపన చేయాల్సిందే.రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థిక పరిస్థితిని, గ్యారంటీలు, ఆదాయ వనరులపై పూర్తి అవగాహన ఉండటంతో దేశీయ బ్యాంకులన్నీ నిధులు సమకూర్చేందుకు వెనుకడుగు వేస్తున్నాయి. ముఖ్యంగా హైడ్రా పేరిట నగరంలో జరిగిన విధ్వంసం దాని పర్యవసానాలు రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ రంగంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ క్రమంలో ఇలాంటి సంస్థలకు నిధులు మంజూరు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఇదే హెచ్ఎండీఏ అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతున్నది. దీంతో దేశీయ బ్యాంకులన్నీ చేతులు ఎత్తివేయడం, ఆర్బీఐ పెడుతున్న కొర్రీలు కూడా అప్పు పుట్టడం లేదనే తెలుస్తోంది. ఈ క్రమంలోవిదేశీ రుణాల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న సర్కారు.. తక్కువ వడ్డీ పేరిట ఖండాంతరాలు దాటి నిధుల కోసం పర్యటించాల్సి వస్తున్నది. నగర అభివృద్ధిని నిర్వీర్యం చేసేలా కాంగ్రెస్ విధి విధానాలు వేల ప్రాజెక్టుల భవితను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ముఖ్యంగా హెచ్ఎండీఏ ప్రతిపాదించిన దాదాపు 25 వేల కోట్ల ప్రాజెక్టులకు నిధులను సమకూర్చలేక, కాగితాల్లో మూలుగుతున్నాయి. ఎలివేటెడ్ కారిడార్లు, అవుటర్ రింగు రోడ్డు నుంచి ట్రిపులార్‌ను అనుసంధానం చేస్తూ చేపట్టే గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్లు, మూసీ వంటి ప్రాజెక్టులు ఇలా వేలాది కోట్లు విలువ చేసే ప్రతిపాదనలు కొట్టుమిట్టాడుతున్నాయి. వీటిలో కొన్నింటికి టెండర్లు ప్రక్రియ ముగిసినా, వాస్తవ పరిస్థితిలో నిధుల కొరత లేకుండా పురోగతి లేక విలపిస్తున్నాయి. అయితే సర్కారు చేతిలో వేల కోట్ల ప్రాజెక్టులు ఉంటేఁ చేతిలో చిల్లి గవ్వ లేకుండానే ప్రతిపాదనలతో ఊరిస్తున్న కాంగ్రెస్ సర్కారుఁ అభివృద్ధిలో వెనకపడేలా చేసింది.

# పుట్టగొడుగుల్లా.. హోటళ్లు!

- భూదాన్ పోచంపల్లిలో నిబంధనలకు పాతర
- మున్సిపల్ అనుమతులు లేకుండానే వ్యాపారాలు
- కరువైన నిఘా.. ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ శానిటేషన్ అధికారులు



**భూదాన్ పోచంపల్లి, (తొలివెలుగు ప్రతినిధి కేమ విష్ణు):** భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. సంబంధిత శాఖల అనుమతులు తీసుకున్న తర్వాతనే ఈ వ్యాపారాలను నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, నిబంధనలను తుంగలో తొక్కి ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతో పాటు ప్రజారోగ్యం కూడా ప్రమాదంలో పడుతోందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం కొనసాగుతున్న అనేక టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు సరైన అనుమతులు లేకుండానే నడుస్తున్నట్లు సమాచారం. అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంతో వ్యాపారులు విచ్చలవిడిగా దుకాణాలు ఏర్పాటు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### సుచీ శుభ్రత కరువు:

భూదాన్ పోచంపల్లిలో బడా, చోటా వ్యాపారులు నిర్వహిస్తున్న అనేక టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో కనీస పరిశుభ్రత కూడా పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. వంటగదులు అపరిశుభ్రంగా ఉండటం, వాడిన పాత్రలను సక్రమంగా శుభ్రం చేయకపోవడం, ఆహార పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో ఉంచడం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### అనుమతులు లేకుండా హోటళ్లు ఏర్పాటు చేయరాదు: మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి




ఈ విషయమై భూదాన్ పోచంపల్లి మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డిని సంప్రదించగా ఆయన స్పందించారు. మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసే టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటళ్లలో పరిశుభ్రత పాటించకపోతే ప్రత్యేక దాడులు నిర్వహించి చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

### కల్తీ నూనెలు.. నాసిరకం పదార్థాలు:

హోటళ్లు, రెస్టారెంట్లు, మిఠాయి దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కల్తీ వంట నూనెలు, నాసిరకం ఆహార పదార్థాలు వాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెస్టింగ్ పౌడర్లు, నాణ్యత లేని మసాలాలు, పాత నూనెలను మళ్లీ మళ్లీ ఉపయోగిస్తూ వినియోగదారుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### కొరవడిన నిఘా.. నామమాత్ర తనిఖీలు:

ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని హోటళ్లపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, తనిఖీలు మాత్రం నామమాత్రంగానే జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి అధికారులు తనిఖీలు చేసి వెళ్లిపోతున్నారే తప్ప, కేసులు నమోదు చేయడం లేదా భారీ జరిమానాలు విధించడం లేదని అంటున్నారు.




ముల్లాన్‌పూర్: ఐపీఎల్‌లో మరో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. మండువేసవిలో అభిమానులను అలరిస్తున్న ఐపీఎల్ దాదాపు ఆఖరి అంకానికి చేరుకుంది. ఇప్పటికే డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఫైనల్ చేరుకోగా, మరో బెర్తు కోసం గుజరాత్ టైటాన్స్(జీటీ), రాజస్థాన్ రాయల్స్(ఆర్ఆర్) మధ్య పోటీ నెలకొన్నది. శుక్రవారం క్వాలిఫయర్-2లో భాగంగా గుజరాత్, రాజస్థాన్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. బలాల పరంగా చూస్తే ఇరు జట్లు సమవుజ్జీలుగా కనిపిస్తున్నాయి. ఆర్‌సీబీ చేతిలో భారీ ఓటమితో గుజరాత్..క్వాలిఫయర్-2లోకి ప్రవేశించగా, ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తుగా ఓడించిన రాజస్థాన్ మరో అడుగు ముందుకేసింది. లీగ్ దశలో గుజరాత్ టాప్-2లో నిలువగా, ఆర్ఆర్ ఆఖరి బెర్తుతో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. లీగ్ చరిత్రలో ఒక్కోసారి టైటిల్ గెలిచిన ఈ రెండు జట్లు మరోమారు టైటిల్ సాధించాలన్న పట్టుదలతో ఉన్నాయి. వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీ అన్నీతానై రాజస్థాన్ బ్యాటింగ్‌ను ముందుండి నడిపిస్తుంటే..మరోవైపు సాయిసుదర్శన్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నిలకడగా పరుగులు కొల్లగొడుతున్నారు. ఇరు జట్ల సారూప్యతను గమనిస్తే గుజరాత్, రాజస్థాన్ తమ టాప్-3 బ్యాటర్లపై అధికంగా ఆధారపడి ఉన్నాయి. జీటీ తరపున సుదర్శన్, గిల్, బట్లర్ రాణిస్తుంటే..ఆర్ఆర్‌కు సూర్యవంశీ, జైస్వాల్, జురెల్ కీలకంగా మారారు. జీటీ, ఆర్ఆర్ మధ్య పోరులో గెలిచే జట్టు ఈనెల 31న అహ్మదాబాద్‌లో జరిగే టైటిల్ ఫైట్‌లో ఆర్‌సీబీతో తలపడుతుంది.

### సూర్యవంశీ ఆపతరమా:

ఐపీఎల్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీని ఆపడటం ప్రత్యర్థి జట్లకు తలకుమించిన భారంగా మారింది. హైదరాబాద్‌తో ఎలిమినేటర్ పోరులో 15 ఏండ్ల వైభవ్ విధ్వంసం మాటలకందనిది. ప్రపంచ స్థాయి బౌలర్లు అయిన కమిన్స్, మలింగను గల్లీబౌలర్లుగా మారుస్తూ వైభవ్ కొట్టిన కొట్టుడుకు ముల్లాన్‌పూర్ స్టేడియం హోరెత్తిపోయింది. బంతి పిచ్‌పై పడిందంటే ఆలస్యం..దాని గమ్య స్థానం బౌండరీనే అన్న లక్ష్యంతో సూర్యవంశీ ఫోర్లు, సిక్స్‌లతో చెలరేగిన తీరు మాటలకందనిది. తన ట్రేడ్‌మార్క్ షాట్లతో రికార్డులు తిరుగరాస్తున్న ఈ బుడ్డోడు..క్వాలిఫయర్-2లోనూ చెలరేగితే గుజరాత్ పని అయిపోయినట్లే. అయితే లీగ్‌లో మిగతా జట్లతో పోలిస్తే..బౌలింగ్ పరంగా మెరుగ్గా కనిపిస్తున్న జీటీ..సూర్యవంశీ దూకుడుకు పగ్గాలు వేయకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రబాడ, సిరాజ్, హోల్డర్, రషీద్‌ఖాన్ రూపంలో జీటీ బౌలింగ్ దళం బలంగా కనిపిస్తున్నా..క్వాలిఫయర్-1లో ఆర్‌సీబీ ఆ అంచనాలను తలక్రిందులు చేసింది. సూర్యవంశీకి తోడు జైస్వాల్, జురెల్ చెలరేగితే ఆర్ఆర్‌కు భారీ స్కోరు పక్కా. బౌలింగ్ విషయానికొస్తే..జోఫ్రా ఆర్చర్ ఆల్‌రౌండర్ పాత్ర పోషిస్తున్నాడు. నిప్పులు చెరిగే బంతులతో ప్రత్యర్థుల భరతం పడుతున్నాడు. సూర్యవంశీ, ఆర్చర్..జీటీతో పోరులో కీలకం కానున్నారు. ఈ ఇద్దరు చెలరేగితే రాజస్థాన్‌కు ఫైనల్ బెర్తు ఖాయమైనట్లే.

### జీటీ పుంజుకునేనా:

ఆర్‌సీబీ చేతిలో ఘోర ఓటమితో జీటీ ఒకింత ఒత్తిడిలో ఉంది. టాప్-3 బ్యాటర్లు సుదర్శన్, గిల్, బట్లర్ సూపర్ ఫామ్‌లో ఉండటం గుజరాత్‌కు కలిసొచ్చే అంశం. లీగ్‌లో పరుగుల వరద పారిస్తున్న ఈ ముగ్గురు నిలదొక్కుకుంటే రాజస్థాన్‌కు ఇబ్బందులు తప్పకపోవచ్చు. అయితే వీరు విఫలమైతే గనుక జీటీ బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలినట్లే. అంతగా అనుభవం లేని నిశాంత్ సిద్ధుకు తోడు సుందర్, రాహుల్ తెవాటియాపై అంతగా అంచనాలు లేవు. పిచ్ పరిస్థితులకు అనుగుణంగా రషీద్‌కు తోడు మరో అదనపు స్పిన్నర్‌ను తీసుకునే అవకాశముంది. అంతకుమించి మార్పులేమి ఉండకపోవచ్చు. లీగ్‌లో వికెట్ల వేట కొనసాగిస్తున్న రబాడ, సిరాజ్ మరోమారు విజృంభిస్తే..రాజస్థాన్ దూకుడు కళ్లెం వేయవచ్చు. సూర్యవంశీని మొదట్లోనే ఔట్ చేస్తే మిగతా పనిని లాంఛనంగా పూర్తిచేయవచ్చు.



## కేన్ విలియమన్స్ ప్రపంచ రికార్డు

బెల్‌ఫాస్ట్ వేదికగా ఐర్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ భారీ స్కోర్ దిశగా దూసుకుపోతుంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి కివీస్ 5 వికెట్ల నష్టానికి కివీస్ 361 పరుగుల భారీ స్కోర్ సాధించింది. క్రీజులో టామ్ బ్లండెల్(142), డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్(38) ఉన్నారు. అంతకంటే ముందు రచిన్ రవీంద్ర(121) కూడా సెంచరీతో సత్తాచాటాడు. అయితే ఈ మ్యాచ్‌తో న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్లు కేన్ విలియమ్సన్, టామ్ లాథమ్‌లు ఓ అరుదైన రికార్డును తమ పేరిట లిఖించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 12 విభిన్న దేశాలలో టెస్ట్ క్రికెట్ ఆడిన తొలి జంటగా వారిద్దరూ రికార్డులెక్కారు. ఇంతకుముందు ఈ ఇద్దరు ఆటగాళ్లు 11 దేశాలలో టెస్ట్ మ్యాచ్‌లు ఆడి షేన్ వార్న్, క్రిస్ గేల్, శివనరైన్ చందర్‌పాల్‌లతో పాటు పలువురు పాకిస్తాన్ దిగ్గజ ఆటగాళ్లతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉండేవారు. కానీ ఈ మ్యాచ్‌లో వారిందరిని కేన్ మామ, లాథమ్ అధిగమించారు. ఈ చారిత్రత్మక మ్యాచ్‌లో విలియమ్సన్ 36 పరుగులు చేసి ఫర్వాలేదన్పించగా.. టామ్ లాథమ్ మాత్రం ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. విలియమ్సన్ 2010లో భారత్‌తో జరిగిన మ్యాచ్ ద్వారా టెస్ట్ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. తన తొలి మ్యాచ్‌లోనే సెంచరీ సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ తర్వాత కేన్ వెనక్కి తిరిగి చూడలేదు. అతడి కెప్టెన్సీలో కివీస్ తొలి వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(2021) టైటిల్‌ను సొంతం చేసుకుంది. విలియమ్సన్ ఇప్పటివరకు 109 టెస్టుల్లో 9,497 పరుగులు చేశాడు. త్వరలోనే 10,000 పరుగుల మార్కును అతడు అందుకోనున్నాడు.లాథమ్ విషయానికి వస్తే.. అతడు కూడా 2014 ఫిబ్రవరిలో భారత్‌పైనే టెస్ట్ అరంగేట్రం చేశాడు.. ఇప్పటివరకు 92 టెస్టులు ఆడిన లాథమ్ 16 సెంచరీలు, 31 అర్ధసెంచరీలతో 6,261 పరుగులు సాధించాడు.

## క్వార్టర్ ఫైనల్లో సింధు

సింగపూర్: ఏడాదిన్నర కాలంగా టైటిల్ కోసం వేచి చూస్తున్న భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు సింగపూర్ ఓపెన్ సూపర్750 టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు కేవలం 37 నిమిషాల్లో 219, 2112తో రికో గుంజీ (జపాన్)పై అలవోకగా గెలిచింది. అయితే నేడు సింధు సత్తాకు అసలు పరీక్ష ఎదురుకానుంది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో సింధు ఆడనుంది. ఆన్ సె యంగ్‌తో ఇప్పటి వరకు ఆడిన 8 సార్లూ సింధు ఓడిపోవడం గమనార్హం. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం... మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తనీషా క్రాస్టోధ్రువ్ కపిల (భారత్) జోడీ కూడా క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సాత్విక్‌చిరాగ్ 2115, 1121, 2118తో లీ జె హుయెయాంగ్ పో సువాన్ (చైనీస్ తైపీ)లపై... తనీషాధ్రువ్ 821, 2117, 2116తో యుటా వతనాబెమాయా టగుచి (జపాన్)లపై నెగ్గారు. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్ చేరుకోగా... భారత్‌కే చెందిన మరో అగ్రశ్రేణి ప్లేయర్ హెచ్‌ఎస్ ప్రణయ్ నిష్క్రమించాడు. ప్రపంచ రెండో ర్యాంకర్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో తొలి గేమ్‌లో లక్ష్య సేన్ 20తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో కున్లావుత్ గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగాడు. ప్రపంచ మాజీ చాంపియన్ లో కీన్ యెవ్ (సింగపూర్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 1821, 2116, 1521తో ఓడిపోయాడు.



# అందుకే మాడలింగ్ వదిలేశా

మాడల్‌గా కెరీర్ మొదలుపెట్టి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన అస్సాం బ్యూటీ కాయాదు లోహర్. 'డ్రాగన్' సినిమాతో ఒక్కసారిగా సెన్సేషన్ సృష్టించిన కాయాదు.. 'అల్లూరి' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. వరుస సినిమాలతో బిజీగా మారిపోయిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా విశ్వక్‌సేన్ హీరోగా తెరకెక్కిన 'ఫంకీ'తో మరో హిట్ కొట్టింది. ఈ సందర్భంగా అస్సాం ఆసమ్ బ్యూటీ కాయాదు పంచుకున్న కబుర్లు ఇవి.. మాది అస్సాం. నేను అక్కడే పుట్టాను. మహారాష్ట్రలో పెరిగాను. ఎందుకో తెలియదు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఆసక్తి. ఆ క్రమంలో కొన్నాళ్లు మాడలింగ్ చేశాను. సినిమాల మీదే ఫోకస్ చేయాలని మాడలింగ్ వదిలిపెట్టాను.'కష్టపడాలి, చిత్తశుద్ధితో ఉండాలి, బాధ్యతగా వ్యవహరించాలి' నాకు తెలిసిన ఫార్ములా ఇదే! ఇండస్ట్రీలో పరిచయాలు లేకపోవడంతో ప్రతి ఆడిషన్‌లో నన్ను నేను నిరూపించుకోవాల్సి వచ్చేది. ఎంత కష్టపడ్డా ఫలితం రాకపోవడంతో డిప్రెషన్‌లోకి వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. ఫంకీ షూట్ మొత్తం ఫన్నీగా జరిగింది. డైరెక్టర్ అనుదీప్ చలాకీ మనిషి. నవ్వుతూనే యాక్షన్ చెప్పేస్తాడు. షాట్ ఒకే అవ్వగానే మళ్లీ నవ్విస్తాడు. విశ్వక్‌సేన్ కూడా మంచి వ్యక్తి. మొత్తంగా 'ఫంకీ' షూటింగ్ చాలా ఎంజాయ్ చేశా. తెలుగులో ఇది నా రెండో సినిమానే అయినా, భాష పరంగా పెద్దగా ఇబ్బంది అనిపించలేదు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటా. నాకు సంబంధించిన ఫొటోలు పోస్ట్ చేస్తుంటా. వాటివల్ల కొన్నిసార్లు ట్రోల్స్ కూడా ఎదుర్కొన్నాను. సోషల్ మీడియాలో పుట్టుకొచ్చే పుకార్లు, ట్రోల్స్ చూసినప్పుడు ఒక్కోసారి చిరాగ్గా అనిపిస్తుంది. కానీ, ఆ కామెంట్లకు నేను బాధపడటం ఏమిటని ఇగ్నోర్ చేస్తా. గతంలో కొన్ని సినిమాలు చేసినా డ్రాగన్ సినిమాతోనే మంచి గుర్తింపు వచ్చింది. ఆ సినిమా విజయం సాధించడంతో ప్రస్తుతం పది సినిమాలకు సైన్ చేశా. నాని నటిస్తున్న ప్యారడైజ్, సింబు హీరోగా వస్తున్న ఎస్‌టీఆర్-49 ఈ లిస్టులో ఉన్నాయి. వచ్చిన అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నది నా ఆలోచన. అందుకే ప్రతి కథలో నన్ను నేను ఊహించుకొని చేస్తున్నా. పారడైజ్‌లో కొత్తగా కనిపిస్తా. తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరిస్తారనే నమ్మకంతో ఉన్నా.







## హత్యలా? దైవ శిక్షా?.. ఓటీటీలోకి వచ్చిన భయానక క్రైమ్ థ్రిల్లర్

కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చిన ఇంటెన్స్ సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'రాక్షస' ఓటీటీ వేదికగా ప్రేక్షకులకు అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5 (వవ5)లో ఫిబ్రవరి 20 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది. క్రైమ్ థ్రిల్లర్ జానర్ ఇష్టపడే వారికి ఈ సిరీస్ ఒక ఆసక్తికరమైన ఎంపికగా నిలుస్తోంది. ఈ కథ ఉత్తర కర్ణాటకలోని మాలప్రభా నది ఒడ్డున, యెల్లమ్మ ఆలయ సమీప ప్రాంతంలో జరుగుతుంది. నది ఒడ్డున కుళ్లిపోయిన స్థితిలో కొన్ని శవాలు దొరకడంతో కథ మొదలవుతుంది. గ్రామస్తులంతా మొసలి దాడుల వల్లే ఈ మరణాలు సంభవిస్తున్నాయని, అది ఒక దైవ శిక్ష అని నమ్ముతుంటారు. కానీ, సబ్-ఇన్‌స్పెక్టర్ హనుమప్ప (విజయ్ రాఘవేంద్ర) మాత్రం ఇవి సాధారణ మరణాలు కావని, పక్కా ప్రణాళికతో చేసిన హత్యలని అనుమానిస్తాడు. ఈ కేసును దర్యాప్తు చేసే క్రమంలో అతనికి స్థానిక మూఢనమ్మకాలు, వ్యక్తిగత జీవితంలోని సమస్యలు సవాళ్లుగా నిలుస్తాయి. ఈ హత్యల వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించి, హంతకుడిని పట్టుకోవడమే లక్ష్యంగా హనుమప్ప సాగించే ప్రయాణం ఉత్కంఠ రేపుతుంది. ఈ సిరీస్‌లో మొత్తం 7 ఎపిసోడ్‌లు ఉండగా, ప్రతి ఎపిసోడ్ 20-25 నిమిషాల నిడివితో సాగుతుంది. అవినాష్, జహంగీర్ కీలక పాత్రలు పోషించారు. 2022లో వచ్చిన విజయవంతమైన తమిళ సిరీస్ 'విళంగు'కు ఇది అధికారిక కన్నడ రీమేక్ కావడం విశేషం.



## యువతకు మృణాల్ ఠాకూర్ లవ్ సలహా

### ప్రేమ విషయంలో యువత ఓపికగా ఉండాలన్న మృణాల్ ఠాకూర్

'సీతారామం', 'హాయ్ నాన్న' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు ఎంతగానో దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్, ప్రేమ విషయంలో నేటి యువతకు ఓ ముఖ్యమైన సందేశం ఇచ్చారు. ప్రేమను కాపాడుకోవాలంటే ఓపిక చాలా అవసరమని, దానిపై సులభంగా నమ్మకం కోల్పోవద్దని ఆమె సూచించారు. ప్రస్తుతం తన కొత్త చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. "ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ప్రేమలో ఓపిక తగ్గిపోతోంది. అందుకే చాలామంది ఒకరినొకరు తేలిగ్గా వదులుకుంటున్నారు. మా సినిమాలో పాత్రల మాదిరిగా పాతకాలపు మనస్తత్వం ఉంటే బాగుంటుంది. చిన్న గొడవ వస్తే చాలు, వెంటనే ఒకరినొకరు బ్లాక్ చేసేస్తున్నారు. మా దారులు వేరు, మేం ఒకరికొకరం సెట్ కాము అని తేలిగ్గా చెప్పేసి సంబంధాలను వదులుకుంటున్నారు" అని అన్నారు. "ప్రతి యువతీ యువకుడు ప్రేమను నమ్మాలని కోరుకుంటున్నాను. దయచేసి ప్రేమపై నమ్మకం వదులుకోవద్దు. అది చాలా అందమైన, అద్భుతమైన అనుభూతి. సరైన వ్యక్తి మీ జీవితంలోకి వస్తే, జీవితం సులభంగా మారుతుంది. అందుకే సరైన వ్యక్తి కోసం ఓపికగా ఎదురుచూడండి. అంతేకానీ తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు" అని యువతకు ఆమె సలహా ఇచ్చారు. ఇక 'దో దీవానే షెహర్ మే' చిత్రంలో మృణాల్‌తో పాటు సిద్ధాంత్ చతుర్వేది, సందీపా ధర్, ఆయేషా రజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంజయ్ లీలా భన్సాలీ, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 20న విడుదల కానుంది.

## తమిళంలో బంపరాఫర్

తెలుగమ్మాయి శ్రీలీల అద్భుతమైన అవకాశాన్ని దక్కించుకుంది. ఇప్పటికే తెలుగులో అగ్ర కథానాయికగా వెలుగొందుతున్న ఈ అందాలభామ.. 'పరాశక్తి' సినిమాతో తమిళచిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఆ సినిమా ఫలితం ఎలాగున్నా.. శ్రీలీలకు తమిళనాట అవకాశాలు మాత్రం బాగానే వరిస్తున్నాయి. తమిళ అగ్ర కథానాయకుడు అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ తెరకెక్కించనున్న చిత్రంలో శ్రీలీల కథానాయికగా ఎంపికైందనేది లేటెస్ట్ న్యూస్. ప్రస్తుతం తమిళ మీడియాలో ఈ వార్త బలంగానే వినిపిస్తున్నది. ఇక సినిమా విషయానికొస్తే.. 'ఏకే64' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై టాలీవుడ్ అగ్ర నిర్మాత అనిల్ సుంకర నిర్మించనున్నారు. అనిరుధ్ సంగీత దర్శకుడు. ఈ సినిమా షూటింగ్ ఈ నెలలోనే మొదలు కానున్నది. ఈ ఏడాది చివర్లో కానీ, సంక్రాంతి కానుకగా గానీ సినిమాను విడుదల చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారు.







## 'కాక్ టెయిల్ 2'లో రష్మిక పాత్రపై వైరల్ న్యూస్

వరుస విజయాలతో దూసుకుపోతున్న రష్మిక మందన్న, ఇప్పుడు మరో ప్రయోగాత్మక పాత్రతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ మూవీగా భావిస్తున్న 'కాక్‌టెయిల్ 2'లో ఆమె పోషిస్తున్న పాత్ర గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వార్త వైరల్ అవుతోంది. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో రానున్న ఈ చిత్రంలో కృతి సనన్, రష్మిక మందన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్ మీడియా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో వీరిద్దరూ స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారం రాకపోయినప్పటికీ వీరి పాత్రల గురించి ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. ఇదొక విభిన్నమైన ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని, రష్మిక-కృతి పాత్రల మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ జనవరి 31వ తేదీతో పూర్తయింది. 2012లో సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె నటించిన సూపర్ హిట్ 'కాక్‌టెయిల్' చిత్రానికి ఇది సీక్వెల్‌గా వస్తోంది. ఈ సినిమాలో షాహిద్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపిస్తారని దర్శకుడు వెల్లడించారు. త్వరలోనే ఈ మూవీ రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని చెప్పారు.